నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
10 | మహబూబ్‌నగర్, గురువారం 6 ఫిబ్రవరి 2025 | NAGARKURNOOL

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

- ఏడాదిలో కాంగ్రెస్ చేసిందేది శూన్యం
- అధికారంలో లేక పోయినా ప్రజల్లోనే ఉండాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి శూన్యమనేది జగమెరిగిన సత్యమని, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. నాయకులు నిత్యం ప్రజా క్షేత్రంలో ఉండి వారి సమస్యల్లో చేదోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఇటీవల పదవీకాలం ముగిసిన వనపర్తి, పెబ్బేరు మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్, వైస్ చైర్మన్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండు మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టితో అభివృద్ధి పనులు చేపట్టి రాష్ట్ర స్థాయిలో పోటీ పడ్డామన్నారు. గతంలో మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన డాక్టర్ బాలకిష్టయ్య ముందు మాపుతో మౌలిక వసతులను సమకూర్చితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం బీఆర్ఎస్ హయాంలో మిగిలిన అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. జిల్లా కేంద్రంలో ప్రధానంగా రోడ్ల విస్తరణ సాహసోపేత మైలురాయని, అనేక కొత్త కార్యాలయాలు సాధించుకుని చెప్పారు. కొత్త మున్సిపాలిటీ అయిన పెబ్బేరును అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపామన్నారు. పదవీకాలం ముగిసిందని ప్రజలపై నిర్లక్ష్యం వహించరాదని, అనుక్షణం ప్రజలను అనుసరించే ఉండాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న చేతకాని పనులను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు గట్టుయాదవ్, కరుణశ్రీ, మాజీ వైస్ చైర్మన్లు వాకిటి శ్రీధర్, కర్రెస్వామి, నాయకులు కురుమూర్తి యాదవ్, రమేశ్‌గౌడ్, దిలీప్‌రెడ్డి, అశోక్, పరంజ్యోతి, తిరుమల్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, రహీం, గులాం ఖాదర్, నీలస్వామి, జోహెబ్, రాములుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

విద్యార్థులకు ఇబ్బందులు రానీయొద్దు

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- కేజీబీవీ నూతన భవనానికి భూమిపూజ

భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

మానవపాడు, ఫిబ్రవరి 5 : విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సొంత బిడ్డల్లా చూసుకొని నాణ్యమైన భోజనం అందించడం తోపాటు మెరుగైన విద్యాబోధన చేయాలని ఎమ్మెల్యే విజేయుడు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో రూ.3కోట్ల 25లక్షలతో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం పాఠశాలలో తరగతి గదులు, విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. ఉడికీ ఉడకని అన్నం, సాంబారు రుచికరంగా లేక పోవడంతో మీ ఇంట్లో కూడా ఇలానే వండుతారా అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థుల ఇబ్బందులను తొలగించున్నట్లు తెలిపారు.

రైతు కుటుంబాన్ని ఆదుకుంటాం..

పంటలు పండక అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న రైతు శేఖర్‌రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే విజేయుడు అన్నారు. గత నెల 20వ తేదీన ఆత్మహత్య చేసుకున్న రైతు శేఖర్‌రెడ్డి కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు.

ఉత్సాహంగా పొట్టేళ్ల పందెం పోటీలు

అయిజ, ఫిబ్రవరి 5 : మండలంలోని టీ టీదొడ్డిలో గుండ్ల భీమరాయుడు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో అంతర్రాష్ట్ర పొట్టేళ్ల పందెం పోటీలను బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. 17 పొట్టేళ్లు తలపడ్డాయి. అయిజకు చెందిన నర్సింహ మొదటి బహుమతి, రెండో బహుమతి నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన రమేశ్, మూడో బహుమతి ఎర్ర బాడుకు చెందిన రాయన్, నాలుగో బహుమతి హైదరాబాద్‌కు చెందిన ఖాన్‌కు చెందిన పొట్టేళ్లు గెలుపొందాయి. యజమానులకు ఆలయ కమిటీ నగదు బహుమతులను అందజేసింది.

టీటీదొడ్డిలో తలపడుతున్న పొట్టేళ్లు

పెల్లుబికిన ఆగ్రహావేశాలు



- తప్పుల తడకగా కులగణన సర్వే వివరాలు
- భగ్గుమన్న బీసీవర్గాలు
- సీఎం రేవంత్‌రెడ్డిపై ఫైర్
- రాజకీయంగా అణగదొక్కే కుట్ర
- కేసీఆర్ సర్కారులో 51శాతం జనాభా..
- పదేండ్లలో 46 శాతానికి ఎలా తగ్గిందంటూ నిలదీతలు
- ఉమ్మడి జిల్లాలో సీఎం దిష్టిబొమ్మల దహనం

కాంగ్రెస్ సర్కారు చేపట్టిన కులగణనపై బీసీలు భగ్గుమన్నారు. రాజకీయంగా అణచివేసేందుకు రేవంత్ సర్కారు కులగణన పేరుతో కుట్రలు పన్నుతుందని ఆరోపిస్తున్నారు. ఇప్పుడిప్పుడే రాజకీయంగా ఎదుగుతుండడంతో సర్వే పేరుతో మోసం చేస్తున్నదని మండిపడ్డారు. 2014లో కేసీఆర్ ప్రభుత్వంలో చేపట్టిన సమగ్ర సర్వేకు, కాంగ్రెస్ ప్రస్తుతం చేపట్టిన సర్వేకు ఎంతో వ్యత్యాసం ఉందంటున్నారు. రాష్ట్రంలో 56 నుంచి 60 శాతం బీసీ జనాభా ఉండగా, కేవలం 46 శాతం మాత్రమే ఉన్నారని, వివిధ వర్గాలను కలిపితే 55 శాతానికే పరిమితం చేసే కుయుక్తులు పన్నినట్లు ఆరోపించారు. ఈ వివరాలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉన్నదని దుమ్మెత్తిపోస్తున్నారు.

– మహబూబ్‌నగర్ (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 5

బీసీలను అణగదొక్కే కుట్ర..

రిజర్వేషన్ల ముసుగులో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పుల తడకగా ఉన్నది. బీసీలను అణచివేసే ప్రయత్నంగానే కులగణన చేపట్టారు. రాజకీయంగా ఎదగకుండా చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆడుతున్న నాటకం. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో సమగ్ర కుటుంబ సర్వే చేసినప్పుడు 51శాతం ఉన్న బీసీ జనాభా నేడు 46శాతానికి పడిపోయిందంటే కులగణన ఎలా చేశారన్నది అర్థమవుతున్నది. కులగణన పేరుతో బీసీలను తక్కువగా చూపించేందుకు కాంగ్రెస్ సర్కారు కుట్ర చేసింది. సుమారుగా 20లక్షల మంది బీసీలు లెక్కలో లేకుండా పోయారు. సీఎం ఇందుకు సమాధానం చెప్పాలి. కులగణన ద్వారా లెక్కిస్తే ఓసీలు కేవలం 10శాతం మాత్రమే ఉంటారు. 15శాతం చేసి చూపించారు. బీసీలను చంపి ఓసీలను బతికిస్తారా? బీసీలను తక్కువ చేస్తున్న రేవంత్‌కు రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతాం.

- బైకని శ్రీనివాస్‌యాదవ్, బీసీ నాయకుడు

కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం లేదు

బీసీలకు 42శాతం రిజర్వేషన్ లేని సబ్‌ప్లాన్ లేని నివేదిక ఇది. కేసీఆర్ హయాంలో సమగ్ర కుటుంబ సర్వేలో కోటీ 80లక్షలు జనాభా ఉంటే ఇప్పుడు కోటీ 60లక్షలకు ఎలా తగ్గింది. బీసీ వర్గాలకు కోలుకోలేని దెబ్బ. గణతంత్ర రాజ్యంలో గల్లంతైన గణంకాలతో బీసీలకు కాంగ్రెస్ ద్రోహం చేసింది. బీసీ, ఎస్సీ జనాభాను తగ్గించి అగ్రకులాల జనాభాను పెంచారు. 8శాతం ఉన్న అగ్రకులాలు 5% శాతాపైగా పెరిగితే, 51శాతం ఉన్న బీసీలు, 18 శాతం ఉన్న ఎస్సీలను తగ్గించి చూపడం సిగ్గుచేటు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో బహుజనులను, మైనార్టీలను అణచివేసేకుట్ర.

- మోహన్ బాబు, బీఆర్ఎస్ తెలంగాణ ఉద్యమ నాయకుడు

సక్రమంగా సేకరించని వివరాలు

బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని గొప్పలు చెప్పుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన ముసుగులో ఇటీవల ప్రజల్లోకి వెళ్లి తేల్చిన లెక్కల నివేదికలు తప్పులతడకగా ఉన్నాయి. 2014లో జరిపించిన ప్రకారం బీసీలు 51 శాతంగా తేల్చగా, జనాభా 1.85 కోట్లుగా నిర్ధారించారు. పదేండ్ల తర్వాత కాంగ్రెస్ చేపట్టిన కులగణనలో 46 శాతంతో 1.64 కోట్ల జనాభా మాత్రమేనని చెప్పడం విడ్డూరంగా ఉందంటున్నారు. ఉన్న జనాభకు 5 శాతం తగ్గించి చూపడం దారుణమని, ఈ తప్పుల తడకల సర్వే నివేదికను అసెంబ్లీలో ఆమోదించి చట్టసభల్లో ప్రవేశపెట్టి తప్పుడు సమాచారం ఇవ్వడంపై బీసీ సంఘాలు భగ్గుమంటున్నాయి. బీసీ జనాభా.. మూడేండ్ల తర్వాత పెరగాల్సిందిపోయి.. తగ్గించడమేమిటని నిలదీస్తున్నాయి. కులగణన లెక్కలు సక్రమంగా సేకరించలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ సాధన కోసం ముందువరుసలో ఉండి పోరాటం చేసిన బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనతో తక్కువ చేసి చూపడంపై బీసీ సంఘాలు మండిపడుతున్నాయి. ప్రభుత్వ తీరును ఎండగడుతూ నిరసనలు వెల్లువెత్తాయి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం..

కామారెడ్డి డిక్లరేషన్‌లో 42 శాతం అమలు చేసే ఉద్దేశం, బీసీలకు సబ్‌ప్లాన్‌ను అమలు చేసే ఆలోచన లేదని కులగణన సర్వేలో తేలింది. తప్పులను వెంటనే సరిదిద్దాలని, ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్ కల్పించాలని, కేబినెట్‌లో సముచిత స్థానం కల్పించే వరకు పోరాడుతామని బీసీ సంఘాల నేతలు స్పష్టం చేస్తున్నారు. మంత్రివర్గంలో చోటివ్వకపోవడం, రాజ్యాధికారంలో న్యాయమైన వాటా దక్కకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణంపోయినా.. భూములివ్వం

- నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలపై నీలి నీడలు
- సీఎం సొంత జిల్లాలో వెల్లువెత్తుతున్న నిరసనలు
- తిప్రాస్‌పల్లి, బాపురంలో సర్వే అధికారులను తరిమివిన రైతులు
- కొడంగల్ కోసం మా ప్రాంతాన్ని ఎడారి చేస్తారా అని నిలదీత
- సర్కారుపై రైతులు ఆగ్రహం
- మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

ఊట్కూర్, ఫిబ్రవరి 5 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనుల ప్రారంభంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. జీవో 69 ద్వారా సీఎం సొంత జిల్లాలో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులపై రైతుల నుంచి నిరసనలు వెల్లువెత్తున్నాయి. మక్తల్ నియోజకవర్గంలోని భూత్పూర్ రిజర్వాయర్ నుంచి ఊట్కూర్ పెద్ద చెరువు, పేరపళ్ల జయమ్మ చెరువు నుంచి సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌కు 7 టీఎంసీల సాగునీటిని అందించేందుకు ప్రాజెక్టు మొదటి ఫేజ్ నిర్మాణ పనులను చేపట్టారు. ఈ నిర్మాణ పనులను ఊట్కూర్ మండలంలోని తిప్రాస్‌పల్లి, బాపురం శివారు రైతులు అడ్డుకొని నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం గతంలో పలుమార్లు హెలికాప్టర్ ద్వారా లైడర్ సర్వే నిర్వహించిన ప్రభుత్వం ఓపెన్ కెనాల్, పంప్ హౌజ్, విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం తాజాగా ఊట్కూర్, బాపురం, తిప్రాస్‌పల్లి గ్రామాల శివారులో భూ సేకరణ కోసం సర్వే చేపట్టింది. వారం రోజుల నుంచి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు భూ సేకరణ కోసం సర్వే చేపట్టారు. సర్వే విషయాన్ని ఇటు ప్రభుత్వం, అటు మెగా ఇంజినీరింగ్ కంపెనీ ప్రతినిధుల నుంచి రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. గోప్యంగా సర్వే నిర్వహిస్తుండటంతో శివారు రైతులు అధికారులను అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం బాపురం శివారులోని సర్వే నెంబర్ 25,26లో పంప్‌హౌజ్ నిర్మాణం కోసం అధికారులు దగ్గరుండి చేపట్టిన మట్టి నమూనా పరీక్షలను రైతులు అడ్డుకున్నారు. తమ పొలాల్లో దొంగచాటున సర్వే పనులు చేపడితే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు.

ఇదే క్రమంలో రైతులను సముదాయించేందుకు పోలీసు బలగంతో వచ్చిన తాసీల్దార్ చింత రవిని సైతం రైతులు నిలదీశారు. తమ భూముల్లో సర్వే చేపట్టడం తగదని హెచ్చరించారు.

భూములిచ్చేప్రసక్తే లేదు..

కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1,200 కోట్ల టెండర్ ప్రక్రియతో మెగా ఇంజినీరింగ్ కంపెనీకి పనులను అప్పగించింది. ఇదే క్రమంలో ఓపెన్ కెనాల్, పంప్ హౌజ్, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు భూ సేకరణ చర్యలు చేపట్టి పనులను వేగవంతం చేశారు. బుధవారం మరోమారు ఊట్కూర్ మండలంలోని బాపురం, తిప్రాస్‌పల్లి శివారు రైతుల వ్యవసాయ పొలాల్లో ఇరిగేషన్ డీఈ కేత నిఖిల్‌కుమార్, ఏఈఈ వెంకట్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది సహకారంతో సర్వేకు సిద్ధం కావడంతో ఇరు గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పొలాల వద్దకు చేరుకున్నారు. సీఎం సొంత జిల్లాలో బతుకుతున్న తమ పొలాలకే భద్రత లేకుండా పోతే ఎలాగని అధికారులను ప్రశ్నించారు. ప్రాణం పోయినా ఫర్వాలేదు కానీ తమ భూములు ఇచ్చేది లేదని తెగేసి చెప్పారు. తమకున్న కొద్దిపాటి వ్యవసాయ భూములను సీఎం సొంత నియోజకవర్గం మేలు కోరి తన్నుకుపోతే తాము ఎలా బతకాలని నిలదీశారు. రైతుల రాకను గుర్తించిన రెవెన్యూ అధికారులు ఇందిరమ్మ ఇండ్ల సర్వే సాకు చెప్పి ఘటనా స్థలం నుంచి మెల్లగా జారుకున్నారు. కాగా, అధికారులు మాత్రం సాయంత్రం పొద్దుపోయిన సమయాల్లో సర్వేకు వస్తున్నారని, దీంతో రాత్రి, పగలు తమకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని శాపనార్థాలు సీఎం, సర్కారుపై పెడుతున్నారు. సర్వే కోసం వచ్చిన ఇరిగేషన్ అధికారులను సైతం రైతులు, బీఆర్ఎస్ నేతలు అడ్డుకొని వాహనాన్ని ఊరి పొలిమేర నుంచి దాటించారు.

రైతులతో కలిసి అధికారులను అడ్డుకుంటున్న బీఆర్ఎస్ నేతలు

సీఎం, ఎమ్మెల్యే స్పందించాలి..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగానికి భద్రత లేకుండా పోయిందని తాజీ మాజీ జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, తిప్రాస్‌పల్లి మాజీ సర్పంచ్ సుమంగళ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ధ్వజమెత్తారు. భూ సేకరణకు వ్యతిరేకంగా తిప్రాస్‌పల్లి, బాపురం శివారు గ్రామాల రైతులు చేపట్టిన నిరసనకు బీఆర్ఎస్ నాయకులు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. బుధవారం తిప్రాస్‌పల్లి, బాపురం శివారు గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై రైతులతో కలిసి బైఠాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారుల తీరుకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎత్తిపోతలకు తాము వ్యతిరేకంగా కాదని, కొడంగల్ తొలి పచ్చబరిచ ఊట్కూర్ మండలాన్ని ఎడారిగా మార్చేందుకు ఓపెన్ కెనాల్ ద్వారా కాకుండా పైప్‌లైన్ ద్వారా కొడంగల్‌కు సాగునీటిని అందించేందుకు సీఎం కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రాంత రైతులకు సైతం ఓపెన్ కెనాల్ ద్వారా సాగు నీటిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు సంబంధించిన పచ్చని పొలాల్లో పంప్ హౌస్, సబ్ స్టేషన్ నిర్మాణాలు జరిగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రశ్నించిన రైతులపై ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని దాడులకు తెగబడుతోందని, వీడియోలు, ఫొటోలు చిత్రీకరించిన రైతుల సెల్‌ఫోన్లను లాక్కొని భయపెడుతున్నారన్నారు. ప్రజాపాలనలో రైతులకు భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే, సీఎం స్పందించి భూ సేకరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఊట్కూర్ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, శ్రీనివాసులు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

గూడులేక.. గుండె బరువై..

- దిక్కుతోచని స్థితిలో చారకొండ ఇండ్ల బాధితులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు
- కండ్ల ఎదుటే సొధాలు కూల్చడంతో సర్వం కోల్పోయి

శాపంగా మారిన కోదాడ-జడ్చర్ల హైవే బైపాస్ రోడ్డు

- ఓ వైపు కన్నీళ్లు.. మరోవైపు సామాన్ల వెతుకులాట
- ఆవాసం లేక బంధువుల ఇండ్లల్లో తలదాచుకొని..



చారకొండలో ఆరుబయట సామాన్లతో దీనంగా బాధిత కుటుంబం

చార కొండ, ఫిబ్రవరి 5 : ఎవరిని కదలించినా కన్నీళ్లే.. ఎక్కడ చూసినా శిథిలమైన నిర్మాణాలే.. కష్టపడి కట్టుకున్న కలల సౌధాలు కండ్ల ముందే కూలాయి. ఏండ్లుగా కలిసిమెలిసి ఉన్న ఇరుగు.. పొరుగు చిల్లంపల్లిమైంది. దీంతో ఒక్కసారిగా చార కొండ మూగబోయింది. గ్రామంలోని పలు ఇండ్లపైకి బుల్డోజర్లు రావడంతో ఉద్రిక్తత నెలకొన్నది. కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి (167) నిర్మాణంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా చార కొండ-మర్రిపల్లి మధ్య బైపాస్ నిర్మాణంలో అడ్డంగా ఉన్న 29 ఇండ్లను మంగళవారం అధికారులు నిర్ధాక్షిణ్యంగా కూల్చివేశారు. తెల్లవారేసరికి కూల్చివేతలు మొదలుకావడంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. భారీగా మోహరించిన పోలీసులు అడ్డం వచ్చిన వారిని అరెస్టు చేస్తుంటే.. కండ్ల ముందే కష్టపడి కట్టుకున్న ఇండ్లు కూలుతుంటే నిస్సహాయంగా మూడడం తప్పా ఏమీ చేయలేకపోయారు. గూడు లేక బాధితులు చిన్నాభిన్నమయ్యారు. కూల్చివేతలు ముగిశాక సామాన్ల కోసం వెతుక్కోవడం కనిపించింది. దొరికిన కాడికి తీసుకొని కన్నీళ్లు దిగమింగుకొని అక్కడి నుంచి బరువెక్కిన గుండెలతో కదిలారు. చలి నుంచి రక్షణగా రాత్రికి నిద్ర పోయేందుకు నానా పాట్లు పడ్డారు. పశువుల దొడ్లు.. షెడ్లు.. ఇలా కొందరు తెలిసిన వారి ఇండ్లకు వెళ్లగా.. మరికొందరు బంధువుల ఇండ్లల్లో షెల్టర్ తీసుకొన్నారు. తమకు ఇచ్చిన నష్టపరిహారంతో ఎక్కడకు వెళ్లాలని.. కొందామంటే కనీసం ఇంటి జాగా కూడా రాదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వం కోల్పోయి రోడ్డు పాలయ్యామని దీనంగా చెప్పారు. ఇంటి స్థలం ఇవ్వడం తోపాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డునే విస్తరించాలని అనేక దఫాలుగా ఆందోళనలు, రాస్తారోకోలు, ధర్నాలు చేయడంతో కొన్నేండ్లుగా రోడ్డు జోలికి అధికారులు వెళ్లలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కసారిగా అధికార యంత్రాంగం ముందస్తు సమాచారం లేకుండానేఇండ్లపైకి జేసీబీలను ఎక్కుపెట్టింది. ప్రత్యామ్నాయం చూపకుండా కూల్చివేతలు చేపట్టడంతో దుఃఖంతో దొరికిన సామగ్రిని వెతికి పట్టుకోవడం బాధితుల వంతైంది. కూలీ.. నాలీ చేసి ఇండ్లు నిర్మించుకుంటే కూల్చివేయడంతో కుమిలి పోయారు.

నా పరిస్థితి ఎవరికి చెప్పాలి

నాకు ఉన్న 12 అరల జాగలో మా అమ్మ, నాన్న ఉన్నప్పుడు ఇల్లు కట్టారు. వారు చనిపోయినా వారి గుర్తుగా ఇల్లు మాత్రమే మిగిలింది. ఇప్పుడేమో జాతీయ రహదారి కోసం బైపాస్ కట్టాలని నా ఇల్లు మొత్తం కూల్చారు. నేను ఒంటరి వాడినయ్యాను.. ఇల్లు కూల్చివేయడంతో మా అమ్మ ఊరైన నల్లగొండ జిల్లా ఎర్రగుంటపల్లికి వెళ్లి ఉంటున్నా.. ప్రభుత్వం నాకు ఇంటిస్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఆదుకోవాలి.

- గ్యార లింగం, చారకొండ

నోట్లోకి అన్నం ముద్ద పోతలే..

జాతీయ రహదారి బైపాస్ నిర్మాణంలో మాకున్న 22 అరల జాగతోపాటు ఇళ్లు కోల్పోయాం. మేము ఐదుగురు అన్నదమ్ములం. అందరం కలిసి ఒక్కో గదిలో కుటుంబంతో కలిసి ఉండేటోళ్లం.. మాకు ప్రభుత్వం రూ.7 లక్షలు మాత్రమే నష్ట పరిహారం చెల్లించింది. ఆ డబ్బులతో ఎక్కడికి వెళ్లినా కనీసం వంద గజాల జాగ రాదు. అంత తక్కువ పరిహారమిస్తే మేమెట్లా బతికేది.. పొద్దున్నే ఇంటిపైకి జేసీబీలు.. పోలీసులతో వచ్చి మా గూడును కూల్చేశారు. మా సామాన్లు తీసుకుంటామన్న వినలేదు. సమయం ఇవ్వాలని కోరినా ఇవ్వలేదు.. దండం పెట్టి వేడుకున్నా కనికరించలేదు.. నిమిషాల్లో ఇంటిని నేలమట్టం చేశారు. మా పిల్లలతో కలిసి రూ.4 వేలకు అద్దెకు గది తీసుకొని రాత్రి ఉన్నాను.. నాకు ప్రభుత్వం ఇంటి జాగ ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.. నాలాంటి వారికి పరిహారం పెంచి ఇవ్వాలి.

- కొప్ప లక్ష్మయ్య, చారకొండ

ఆదుకోకుంటే చావే శరణ్యం

జాతీయ రహదారిలో నాకున్న 12 అరల ఇళ్లు కూల్చేశారు. నాకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నది. నాకు ప్రభుత్వం నుంచి రూ.7 లక్షలు మాత్రమే పరిహారం కింద చెల్లించారు. కాయ కష్టం చేసి.. పైసా పైసా జమచేసి ఇల్లు కట్టుకున్నా.. ఒక్కసారిగా పోలీసులు, అధికారులు వచ్చి నా ఇంటిని మొత్తం కూల్చారు. ప్రభుత్వం ఇచ్చిన పరిహారం ఏమాత్రం సరిపోదు. రాత్రి వేళల్లో కంటికి కునుకు కూడా రావడం లేదు. మా బతుకులు రోడ్డు పాలు చేశారు. మేమూ మా పిల్లలు ఎలా బతకాలి.. ప్రభుత్వం స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలి. లేకుంటే మా పరిస్థితి ఆగమ్య గోచరమే..

- నల్ల ముత్యాలమ్మ, చారకొండ